## జాతీయ స్థాయి హాకీ పోటీలకు లింగస్వామి

రామన్నపేట, డిసెంబర్16 : మండలంలోని వెల్లంకి గ్రామానికి చెందిన రాపోలు లింగస్వామి జాతీయ స్థాయి హాకీ పోటీలకు ఎంపికయ్యారు. నల్లగొండలోని ఎన్‌జీ కళాశాలలో తృతీయ సంవత్సరం చదువుతున్న లింగస్వామి ఇటీవల నల్లగొండలో జరిగిన పది యూనివర్సిటీ విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబరచడంతో జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక అయ్యారు వచ్చేనెలలో తమిళనాడులో జరిగే జాతీయ స్థాయి హాకి పోటీల్లో మహాత్మాగాంధీ యూనివర్సిటీ తరపున పాల్గొననున్నారు. లింగస్వామి ఎంపిక పట్ల సర్పంచ్ ఎడ్ల మహేందర్‌రెడ్డి, ఎంపీటీసీలు తిమ్మాపురం మహేందర్‌రెడ్డి, ఎర్రోళ్ల లక్ష్మమ్మ, ఉపసర్పంచ్ రవ్వ అనుసూయ వివిధ పార్టీల నాయకులు అభినందించారు.

## ఓటరు జాబితా సవరణకు సహకరించాలి

- మర్రిగూడ తాసీల్దార్ శ్రీనివాస్

మర్రిగూడ,డిసెంబర్ 16 : ఓటరు జాబితా సవరణకు రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని తాసీల్దార్ బి.శ్రీనివాస్ కోరారు. తాసీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులతో శనివారం ఆయన సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా తాసీల్దార్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఓటరు నమోదుతో పాటు తప్పుల సవరణకు అవకాశం ఉందన్నారు. జనవరి1 వరకు 18ఏండ్లు నిండిన వారు ఓటు హక్కు పొందేందుకు అర్హులన్నారు. సమస్యాత్మక పోలింగ్ స్టేషన్‌ల వివరాలను తెలియపర్చాలని కోరారు.అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసిన తర్వాతనే ఓటు హక్కును కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌ఐలు బషీర్ అలీ, శ్రీనునాయక్, నాయకులు ముద్దం నర్సింహ గౌడ్, నక్క తిరుపతయ్య, పగడాల లింగయ్య, కొట్టం శ్రీను యాదవ్,పగిళ్ల లింగస్వామి, బోయపల్లి రాజు గౌడ్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న తాసీల్దార్ శ్రీనివాస్

## పర్యావరణ పరిరక్షణకు మరిన్ని పరిశోధనలు అవసరం

- ఎన్‌ఐటీ బెంగళూర్ ప్రిన్సిపాల్ డీవీ రెడ్డి

రామగిరి, డిసెంబర్ 15 : పర్యావరణ పరిరక్షణకు మరిన్ని పరిశోధనలు అవసరమని ఎన్‌ఐటీ బెంగళూరు ప్రిన్సిపాల్ డీవీ రెడ్డి సూచించారు. నల్లగొండలోని ఎంజీయూలో కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవెల్యూషన్, ఎంజీయూ సోషల్ వర్క్ విభాగం సంయుక్తంగా శనివారం వర్సిటీలో ' సుస్థిర భవిష్యతు కోసం పర్యావరణ కార్యాచరణ' అనే అంశంపై నిర్వహించిన సెమినార్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణకై చేయాల్సి అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌తో పూర్తి వివరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఫర్ గ్రీన్ రెవెల్యూషన్ ప్రతినిధి ఉమామహేశ్వర్‌రెడ్డి, ప్రముఖ పర్యావరణ వేత్త మిట్టపల్లి సురేశ్‌గుప్తా, వర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ అరుణప్రియ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న బెంగళూర్ ప్రిన్సిపాల్ డీవీరెడ్డి

## దత్తత ద్వారా అనాథ బాలలకు ఉజ్వల భవిష్యత్

- మహిళ, శిశు సంక్షేమ జిల్లా అధికారి కృష్ణవేణి

నీలగిరి, డిసెంబర్ 16 : అనాథ బాలలను దత్తత ఇవ్వడం ద్వారా వారికి ఉజ్వల భవిష్యత్ అందుతుందని నల్లగొండ జిల్లా సంక్షేమ అధికారి కృష్ణవేణి అన్నారు. మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శనివారం నల్లగొండ, సూర్యాపేట జిల్లాలలోని వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, అందులో ఆశ్రయం పొందుతున్న బాలలకు దత్తత అంశంపై స్థానిక శిశు గృహలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలల కోసం అండగా నిలబడే కుటుంబానికి అందించి అనాథ బాలల రహిత సమాజంగా తీర్చిదిద్దాలని కోరారు. పిల్లలు లేని చాలా మంది దంపతులు దత్తత కోసం దరఖాస్తు చేసుకుంటున్నారని అన్నారు. కార్యక్రమంలో బాల రక్షా భవన్ కో ఆర్డినేటర్ కాసాని గణేశ్‌గౌడ్, బాలల సంక్షేమ అధికారి హరిత, బాలల పరిరక్షణ ఆధికారి సూర్యాపేట బి.రవికుమార్, పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.


సదస్సులో మాట్లాడుతున్న కృష్ణవేణి

## గుండ్రాంపల్లిలో దొంగల హల్‌చల్

- ఒకే రాత్రి ఏడు ఇండ్లలో చోరీ

చిట్యాల, డిసెంబర్ 16 :మండలంలోని గుండ్రాంపల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. దాదాపు ఏడు ఇళ్లలో దుండగులు నగదు, బంగారు, వెండి వస్తువులు అపహరించుకుపోయారు. గ్రామానికి చెందిన రాచకొండ లింగస్వామి,రాచకొండ సత్తయ్య, రాచకొండ కనకయ్య, దొంతరబోయిన సత్తయ్య, బుస్సు అంజయ్య, బుస్సు లింగస్వామి ఇండ్లతోపాటు మరో ఒకటి రెండు ఇండ్లలో దొంగతనాలు జరిగినట్లు సర్పంచ్ రత్నం పుష్పానర్సింహ తెలిపారు. రాచకొండ సత్తయ్య ఇంట్లో మూడున్నర తులాల బంగారు అభరణాలు, 5 తులాల వెండి అభరణాలు, రూ. 30వేల నగదు, బుస్సు లింగస్వామి ఇంట్లో తులం బంగారం, 30 తులాల వెండి అభరణాలు, రూ. 10వేల నగదు, దొంతరబోయిన సత్తయ్య ఇంట్లో వెండి పట్టా గొలుసులు, నగదు దొంగలు అపహరించుకుపోయినట్లు బాధితులు తెలిపారు. ఎస్ఐ రవి శనివారం ఉదయం సిబ్బందితో దొంగతనాలు జరిగిన ఇండ్లను పరిశీలించారు.

### అయిటి పాములలో..

కట్టంగూర్: మండలంలోని అయిటిపాముల గ్రామంలో శనివారం తెల్లవారుజామున ఓ ఇంట్లో చోరీ జరిగింది. గ్రామానికి చెందిన లట్టుపల్లి విక్రమ్ కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి తలుపులు పగులగొట్టి లోనికి ప్రవేశించి బీరువాను ధ్వంసం చేసి అందులోని తులం బంగారు చైన్, రూ. 3వేల నగదు అపహరించుకుపోయారు. విషయం తెలుసుకున్న బాధితుడు ఇంటికి వెళ్లి చూసి చోరీ జరిగిన విషయాన్ని స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు విచారణ చేపట్టారు.

## ఆర్టీసీలో మహిళ ల ఉచిత ప్రయాణానికి జీరో టికెట్లు

- ఏదైనా ప్రభుత్వ ధ్రువీకరణ పత్రం చూపిస్తేనే అనుమతి
- ఆర్టీసీ ఆర్‌ఎం శ్రీదేవి

నల్లగొండ సిటీ, డిసెంబర్ 16 : రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హమీలు అమల్లో భాగంగా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. అయితే ఇప్పటి వరకు మహిళలు, బాలికలు, ట్రాన్స్‌జెండర్లకు ఎలాంటి టికెట్లు కేటాయించకుండానే ప్రయాణానికి అనుమతి ఇచ్చారు. ప్రస్తుతం కండక్టర్ల వద్ద ఉన్న టిమ్స్‌లో సాఫ్ట్‌వేర్ అప్‌గ్రేడ్ చేయడం ప్రభుత్వం సబ్సిడీ నిధులు విడుదల చేసేలా రోజు వారి ప్రయాణికుల సంఖ్య తేల్చేందుకు శుక్రవారం నుంచి జీరో టికెట్ జారీ చేస్తున్నారు. తెలంగాణ వారికే ఈపథకం అమల్లో ఉండగా ఇక నుంచి మహిళలు, బాలికలు, ట్రాన్స్ జెండర్ల తెలంగాణ వాసులుగా గుర్తించేలా ఏదైనా ధృవీకరణ పత్రం కండక్టర్‌కు చూపించాల్సి ఉంటుందని ఆర్‌ఎం శ్రీదేవి తెలిపారు.

## సైన్స్‌తోనే దేశాభివృద్ధి

- ఐఐసీటీ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి


రామన్నపేలో మాట్లాడుతున్న డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

రామన్నపేట, డిసెంబర్16 : సైన్స్‌తోనే దేశ సమగ్ర అభివృద్ధి సాధ్యమని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ డైరెక్టర్ డి. శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో జిజ్ఞాస కార్యక్రమంలో భాగంగా శనివారం వైజ్ఞానిక ప్రదర్శనను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వృథా నీటి నివారణ, పంట పురుగుల నివారణ, బ్యాటరీ పేపర్ ఫోల్డింగ్, మైక్రోస్కోప్ తదితర అంశాలపై ఇన్నోవేషన్ ప్రాజెక్టులను ప్రదర్శించి అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... శాస్త్రవేత్తల విజయవంతమైన పరిశోధనలతోనే దేశం అనేక రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందన్నారు. వ్యవసాయ ఉత్పత్తులు గణనీయంగా పెరగడానికి పరిశోధనలే కారణమన్నారు. అనంతరం తాను చదివిన పాఠశాలలో చిన్ననాటి మిత్రులతో కలిసి మొక్కలను నాటారు.

తాను చదువుకున్న సమయంలో పాఠశాల నిర్వహించిన ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించి తన మిత్రులతో పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.

కార్యక్రమంలో సీనియర్ శాస్త్రవేత్తలు వత్స్యాల రాణి, రాజేందర్‌రెడ్డి, వెంకట మోహన్, రాజేందర్‌రెడ్డి, జిల్లా సైన్స్అధికారి ధరణి కుమార్, ఎంఈఓ శ్రీధర్, హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి, జ్యోతి, సైదుల్ రెడ్డి పాల్గొన్నారు.

## అందరి సహకారంతోనే అభివృద్ధి

రామన్నపేట, డిసెంబర్16: అందరి సహకారంతోనే వెల్లంకి గ్రామా న్ని అభివృద్ధి చేసినట్లు సర్పంచ్ ఎడ్ల మహేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని వెల్లంకి గ్రామంలో శనివారం గ్రామసభ నిర్వహించారు. 2019 నుంచి 20023వరకు ఎస్ఎఫ్‌సీ, 15వ ఆర్థిక సంఘం పన్నులు, విరాళాల ద్వారా వచ్చిన ఆదాయం చదివి వినిపించారు. అభివృద్ధి నిధులను పారదర్శంకంగా ఖర్చు చేసినట్లు తెలిపారు. పంచాయతీ పాలకవర్గం, సిబ్బంది ప్రజల సమకారంతో గ్రామాన్ని అన్నిరంగాలల్లో అభివృద్ధి చేసి రాష్ట్రస్థాయిలో అవార్డును అందుకోవడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ రవ్వ అనుసూయ, మాజీ సర్పంచ్ తాళ్లపల్లి సతిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి పి.యాదయ్య, వార్డు సభ్యులు జయలక్ష్మి, శాంతి, ఎన్ ఎల్లయ్య, సరిత, సరిత, కర్ణాకర్‌రెడ్డి, నరేశ్ పాల్గొన్నారు.


గ్రామసభలో మాట్లాడుతున్న సర్పంచ్ ఎడ్ల మహేందర్‌రెడ్డి


## లక్ష్మాపురం మాజీ సర్పంచ్ బైక్ దగ్ధం

రామన్నపేట, డిసెంబర్16: మండలంలోని లక్ష్మాపురం గ్రామంలో మాజీ సర్పంచ్ కాంగ్రెస్ నాయకుడు బత్తుల కృష్ణగౌడ్ బైక్‌ను గుర్తు తెలియని వ్యక్తులు శనివారం రాత్రి దగ్ధం చేశారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం కృష్ణగౌడ్ రోజు మాదిరిగానే తన బైక్‌ను ఇంటిముందు పార్క్‌చేసి పడుకున్నాడు.

అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు బైక్‌కు నిప్పటించి పారిపోయారు. అలికిడిని గమనించి బయటికి వచ్చిన కృష్ణగౌడ్ బైక్ దగ్ధమవుతుండడం గమనించి నీళ్లుచల్లి మంటలను ఆర్పారు. బాధితుడు కృష్ణగౌడ్ ఫిర్యాదు మేరకు పోలీసులు క్లూస్‌టీం, డాగ్ స్క్వాడ్ రప్పించి ఆధారాలు సేకరించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ లక్ష్మయ్య తెలిపారు.

## 21న ధర్నాను జయప్రదం చేయాలి

భువనగిరి అర్బన్, డిసెంబర్ 16 : ఎస్సీ వర్గీకరణ చేయాలని ఈనెల 21న ఢిల్లీలో జరిగే ధర్నాను జయప్రదం చేయాలని టీ ఎమ్మార్పీఎస్ నాయకుడు చిలకమారి గణేశ్ అన్నారు. శనివారం పట్టణంలోని వినాయక చౌరస్తాలోని సంఘం ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి మహాధర్నా కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదిగలు 3 శతాబ్దాలుగా అనేకమైన పోరాటాలు చేశారని, అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. పార్లమెంట్ సమావేశాల్లో బిల్లును ఆమోదించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నియోజవర్గ నాయకులు చింతల శంకర్‌మాదిగ, గడ్డం అంజయ్య, కొండమడుగు రాములు, జంగమ్మ, సీతారాములు, అశోక్, రాలయ్య, కిషన్, రమేశ్ పాల్గొన్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న టీ ఎమ్మార్పీఎస్ నాయకులు

## సమస్యల పరిష్కారం కోసమే గ్రీవెన్స్‌డే

- సీజీఆర్‌ఎఫ్ చైర్మన్ నాగేశ్వర్

రామన్నపేట, డిసెంబర్ 16: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసమే వినియోగదారుల గ్రీవెన్స్‌ను నిర్వహిస్తున్నట్లు సీజీఆర్‌ఎఫ్ చైర్మన్ నాగేశ్వర్ తెలిపారు. మండలకేంద్రంలోని విద్యుత్ సబ్ డివిజన్ కార్యాలయంలో శనివారం కన్జ్యూమర్ గ్రీవెన్స్ రెడ్రసాల్ ఫోరం (సీజీఆర్‌ఎఫ్) హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని విద్యుత్ వినియోగదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... డిపార్ట్‌మెంట్ నియమ నిబంధనలప్రకారం పరిశీలించి పరిష్కారిస్తామన్నారు. కార్యక్రమంలో సీజీఆర్‌ఎఫ్ ఇండిపెండెంట్ సభ్యులు కే వెంకటనరేశ్, ఆర్ రాజేశ్వరి, డీఈ బి విజయభాస్కర్‌రెడ్డి, ఏడీఈ సీహెచ్ నరేశ్‌కుమార్‌రెడ్డి, ఏఈలు జే. నర్సింహ, వి. మశ్చేందర్, ఏఓ శ్రీనివాస్, సబ్ ఇంజినీర్లు సత్యపాల్‌రెడ్డి, మత్స్యగిరిగౌడ్, లైన్ ఇన్‌స్పెక్టర్ సోమేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.


దరఖాస్తులను స్వీకరిస్తున్న విద్యుత్ అధికారులు